# నిర్భాగ్య ప్రేమికుడు

రచన :
శ్రీ కే. వి. రమణ

విజయనగరం మ్యూనిసిపల్ హైస్కూలు గంటకొట్టారు. వీధులలో పడ్డారు విద్యార్థి విద్యార్థినులందరూ. అంతవరకూ ప్రశాంతంగా వున్న వాతావరణం నిండిపోయింది రణగొణ ధ్వనితో. కొద్దిసేపటిలో, విద్యార్థుల అల్లరి తగ్గిపోయింది. ఈ మ్యూనిసిపల్ హైస్కూలులో అమ్మాయిలు, అబ్బాయిలు కూడ చదువుతున్నారు. స్కూలు ఆవరణనుంచి చివరకు ముగ్గురమ్మాయిలు, వారి వెనుక అబ్బాయి బయటకు వచ్చారు. ముగ్గురమ్మాయిలలో యిద్దరమ్మాయిలు మాటిమాటికి వెనుదిరిగి చూస్తున్నారు ఎందుకో మరి! కొన్ని క్షణాల్లో కొంత దూరంపోయి ఒక్కొక్కరు నిర్ణీత స్థలాల్లో విడిపోయారు.

అవి వేసవికాలపు రోజులు, వొంటిపూట బడులు. గాలివెచ్చగా వీస్తుంది. సూర్యుని తీక్షణాంశాలవలన కాళ్ళు మాడిపోతున్నాయి; శిరస్సులు వేడెక్కిపోతున్నాయి. తారురోడ్లు ఎండవేడిమికి తాళజాలక కరిగిపోతున్నాయి.

◆ ◆ ◆

మనకు పరిచయం అయిన ముగ్గురు అమ్మాయిలలో ఒకమ్మాయి నిర్మల, రెండవమ్మాయి సరోజ, మూడవమ్మాయి అనసూయ. వారి వెనుకన నడచిన అబ్బాయి పేరు సత్యం. వీరు నలుగురూ ఒకటే 'ఫారమ్.'

నిర్మల ధనవంతులమ్మాయి. ఈమె మ్యూనిసిపల్ హైస్కూలులో 'ఫిఫ్తుఫారం' చదువుతున్నది. ప్రస్తుతము విజయనగరంలోగల ఘంట స్థంభం ప్రక్కనే వీరియిల్లు. ఇంటి ప్రక్కనే వేలుఖరీదుచేసే 'వాచెస్‌షాప్' వుంది. సాధారణంగా డబ్బున్నవాళ్లు చాల గర్వంగా వుంటారు. ఆమెకు కూడ గర్వంవుందనే చెప్పవచ్చు. ఎందుచేతనంటే ఆక్లాసులోని విద్యార్థులు ఆమెతో స్నేహం చేసుకోవాలని అనుకుంటారు. ఆమె నిర్లక్ష్యం చేస్తుంది. ఒకవైపు అందగత్తె, మంచి విలువగల దుస్తులు ధరిస్తుంది.

ఈమె తరగతిలోనే కోదండరావు అనేవ్యక్తి వున్నాడు. అతడు అందగాడేగాకుండా నాటకాలలో అప్పుడప్పుడూ వేషాలు వేస్తూవుంటాడు. ఇతనికి గతసంవత్సరములో ప్రమీల అనే అమ్మాయితో వివాహం జరిగిపోయింది. ప్రమీల విశాఖపట్నంలో మ్యూనిసిపల్ గరల్స్ హైస్కూలులో థర్డ్, ఫారం చదువుతూ వుండేది.

నిర్మలకు నాటకాలంటే ఎక్కువ యిష్టం. అందుచేతనే ఆమెనటుడైన కోదండరావును ప్రేమించింది. కాని కోదండరావుతో ఆమె తన ప్రేమను వ్యక్తంచేయలేదు 'కో-ఎడ్యుకేషన్' వలన కలిగే సాధారణ ఫలితమే అది! గత సంవత్సరము స్కూలు వార్షికోత్సవము జరిగే సమయంలో ప్రమీలను తీసుకవచ్చి కోదండరావుకు పరిచయం చేసింది. ప్రమీల, నిర్మల చాల దగ్గర స్నేహితురాండ్రు.

కోదండరావు ప్రమీలను ప్రేమించ నారంభించాడు. తన తండ్రిచే వాదించి మొత్తం

మీద ప్రమీలాను గతసంవత్సరం పరీక్షలయి పోగానే వివాహం చేసుకున్నాడు. ఈ విషయం ఆస్కూలులోని వారికెవరికీ తెలియదు. అందు చేతనే నిర్మల కోదండరావుని ప్రేమించసాగింది.

సరోజ అంత ధనవంతురాలు కాదు. ఈమె తనతరగతి విద్యార్థి అయిన సత్యాన్ని ప్రేమించింది. కాని సత్యానికి మాత్రం సరోజ తనను ప్రేమిస్తూ వున్నట్టు తెలియదు. సత్యాన్ని ప్రేమించడం చేతనే అతనికి సరోజ ధనసహాయం చేస్తూవుంటుంది.

ఈ లోకంలో ఎవరైనా మంచివారు (మగవారు) ఆడవారికి అంటే యౌవనంలో వున్న వారికి పరిచయమైనట్లయితే వారు రెండు విధములైన భావములతో చూస్తారు. మొదటిది సోదరభావం; రెండవది ప్రేమభావం (ప్రియుని మీద ప్రియురాలికుండే భావం) అనసూయ మొదటిరకానికి చెందినది. ఆమె సత్యాన్ని అన్నగా భావిస్తున్నది. ఎందుచేతనంటే సత్యంతో సరిపోలిన తన అన్నగారు మూడేండ్ల క్రిందట చనిపోయారు. ఆమె సోదరభావంతో సత్యానికి ధనసహాయం చేస్తూవున్నది.

సత్యం నిరుపేద విద్యార్థి. ఈ లోకంలో 'తనవారు' అని చెప్పుకోడానికి ఎవరూ లేరు. ప్రతిసంవత్సరం వుపాధ్యాయులు, విద్యార్థులు దయతలచి ధన, పుస్తకములను సహాయం చేయడంచేత కష్టపడి చదువుతూ తను కాలక్షేపం వెళ్లబుచ్చుతున్నాడు. ఇతడప్పుడు కథలువ్రాసి పత్రికలకు పంపించడంచేత ఏదో కొంత ఫలితాన్ని వారు చూపిస్తూ వుంటారు.

సత్యం నిర్మలను ప్రేమిస్తున్నాడు. సరోజ సత్యాన్ని పేమించి, ఆతని కావుద్దేశ్యంతోనే ధనసహాయం చేస్తూవుంది. మనకు పరిచయం


BEWARE OF IMITATIONS

ALWAYS USE KAREEM BEEDIES

Tel. Add. "KARIMBIDI I."




TELEPHONE No. 4228.

Compare Kareem Beedies with any other Beedies

అయిన ముగ్గురు అమ్మాయిలూ ఒకేతరగతి, ఒకే బెంచీలో కూర్చుంటారు. కాని వారు నడిచే దారులు వేరు, భావాలు వేరు,

కొన్ని గంటలు గడచిపోయాయి. విజయ నగరంలో గొప్పమార్పు వచ్చింది. సూర్య భగవానుడు పశ్చిమగిరులలో అస్తమిస్తున్నాడు. సంజకెంజాయలు అలుముకొంటునాయి. పక్షులు తమతమ గూండ్లకు చేరుకుంటున్నాయి కిలకిలా రావములతో. కార్మిక కర్షకులు తమతమ నివాసములకు చేరుకుంటున్నారు శ్రమనొందిన తనువులతో. బాలురందరూ నూతనోత్సాహ ముతో పరుగెడుతున్నారు మ్యూనిసిపల్ థియేటర్ వైపు అడుకోవడానికి.

'ప్రకాశమ్ పార్కు'లో నుండి రేడియో గానం వినిపిస్తూవుంది. పార్కుచుట్టూ పచ్చని బొద్దుగా పెరిగిన కంచెవున్నది. దానిలోప లున్నాయి పూపొదలు, మల్లెపందిళ్ళు; అక్కడక్కడ శిలాఫలకాలున్నాయి. ఆపార్కు లోపల ఎత్తుగా పెరిగిన తృణసమూహంవుంది కన్నులపండుగ జేస్తూ. విజయనగరంలోగల మంచిపార్కులలో యిదొకటి. మ్యునిసిపల్ థియేటరుకు సమీపంలోనూ, కోడి.రామ్మూర్తి పార్కుకు చేరువలోనూ వుందీపార్కు. ఇక్కడే జనసమ్మర్థం ఎక్కువగా వుంటుంది. ఎందుచేత నంటే దీనికి దగ్గరలోనే 'లీలామహల్,' కృష్ణాథియేటర్' అనే రెండు సినిమాహాల్సు న్నాయి.

అక్కడగల గడ్డిబీడులో నిర్మల కూర్చుని వుంది వొయ్యారాల నొలికిస్తూ అజంతా శిల్పం లా. పూర్తిగా చీకటి పడింది. జనసమ్మర్థం తగ్గిపోతూ వున్నది. ఆమెకూర్చున్న పరిసరా లలో ఎవరూకూడా లేరు. అదిగాకుండా చీక టిగా కూడవుంది.

రేడియోలోనుండి పాటలువినవస్తున్నాయి.

'నీకై వేచియుంటి యిన్నినాళ్ళు,
వేచియుండవలె నింకెన్నాళ్లు,
'రాకకై ఎదురు చూచు చుండు
రమ్మా నాదరికి మోద మొందు'

ఇంతలో సత్యం పార్కులోనికి ప్రవేశిం చాడు. నలువంకల తన దృష్టిని సారించాడు. అతని దృష్టిలోనికి తమోమయ జగత్తులో కూర్చున్న నిర్మల నిర్మలంగా కానవచ్చింది. అడుగులో అడుగువేసుకుంటూ సత్యం నిర్మల దరికి చేరాడు, అతన్ని దూరంనుంచి చూడ గానే నిర్మల తన మోమును ప్రక్కకు తిప్పు కుని ఏవరో మహామేధావినిలా అలోచించ నారంభించింది.

ఎంతో సేపట్నుంచి నిల్చున్నా నిర్మల తనను పలకరించపోయేసరికి సత్యాన్ని నిరాశ ఆవరించింది. మళ్లీ ధైర్యం తెచ్చుకొని చిన్నగా దగ్గాడు. మొహం సత్యంప్రక్క త్రిప్పి తను యింతసేపట్నుంచి చూడని దానివలె ఆశ్చర్య సంభ్రమాలతో "ఏమండీ! ఎంతసేపయింది. మీరువచ్చి? ఇలా కూర్చోండి," అని లేని నవ్వు తెచ్చుకుని పలికింది.

సత్యం ఆమెకు కొంచెం దూరంలో కూర్చు న్నాడు, చుట్టుప్రక్కల కలయ జూశాడు; ఎవ్వరూలేరు. తనమనస్సులో వున్నకోరికను చెప్పుదామనుకున్నాడు. కాని చెప్పటం ఎలా? నోటమాటరాందే? ఆమె ఏమనుకుంటుందో!



SWASTIK


"ఏమండీ! ఎమిటి ఆలోచిస్తూవున్నారు? ఏమైనా విశేషాలున్నాయా?" అని అడిగింది నిర్మల అతని ఆలోచనల్ని తెగ తెంపులు చేస్తూ.

"అబ్బే, ఏమీ ఆలోచించటం లేదండి! విశేషాలేమీ లేవు కాని......," అని కొంచెం ఆగాడు. సత్యం. ఇలామాట మధ్యలో ఆపే సరికి నిర్మల ఆతని వైపు సూటిగా చూసింది. ఆతని గుండెలు అమాంతంగా ఆగిపోయినంత పనయింది. మళ్ళీ ధైర్యం తెచ్చుకుని మెల్లగా అన్నాడు—

"అబ్బే, మరేమీ లేదండి మీతో ఒక విషయం చాల రోజుల్నుండి చెప్పాలనుకుంటున్నాను. మీరేమైనా అనుకుంటారేమో..."

"నేనెవర్నండీ ఏమైనా అనుకోవటానికి, చెప్పండి," అన్నది నిర్మల నిర్లక్ష్యంగా మరొక వైపు చూస్తూ.

ఇంతలో గాలికొంచెం జోరుగా వీచింది సుమముల సువాసనతో.

"నిర్మలా!...నేను...నిన్ను...ప్రేమిస్తున్నాను," అన్నాడు తన ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుంటూ. ఈ మాటలు వినగానే 'ఎలక్ట్రిక్ షాక్' తిన్నట్లు ఫీలయింది నిర్మల. చాల కోపంగావుంది సత్యం రెండు చెంపల మీద కొట్టాలనుకొన్నది, కాని చేతులు రాలేదు. గట్టిగా కేకలు వేద్దామనుకున్నది. కాని కేకలు వేస్తే తన గౌరవానికే భంగం. మర్నాడు స్కూలు గోడలమీద యిద్దరి పేర్లు జతపర్చి అంటిస్తారు.

"ఇలాంటి కోరికలింకెప్పుడు మనస్సులో పెట్టుకుని చదువుపాడు చేసుకోవద్దు. అయినా నీ అంతస్థెక్కడ, నా అంతస్థెక్కడ? అందని

ప్రూనిపండ్లు కాశింపవద్దు,'' అని మెల్లగా పలికి పార్కునుండి బయట పడ్డది.

తనుతప్పు చేశానని, తన్నుక్షమించమని అడుగుదామనుకున్నాడు. కాని ఆడదాన్ని, అందులోనూ ప్రేమను తృణీకరించిన దానిని క్షమాపణ వేడటమూ అనుకున్నాడు. ఏమీ పాలుపోక తాను అలానే కూర్చుని వున్నాడు.

ఇంతలో సరోజవచ్చి అతనికి కొంచెం దూరంలో కూర్చుంది, కొద్దిసేపు వారిద్దరి మధ్య మౌనం రాజ్యంచేసింది.

''ఏమండీ! సత్యంగారూ! విచారంగావున్నారు? కారణం తెలుసుకోవచ్చా'' అన్నది సరోజ మౌనాన్ని భంగపరుస్తూ.

''ఏమీ లేదండి, వొంట్లో బాగుండలేదు,'' అన్నాడు సత్యం,

''నాదగ్గర దాచిపెడ్తున్నారు. మీరు, నిర్మల మాట్లాడడం చూశాను. అప్పుడు నేను యీ పొదల వెనుకనే వున్నాను. అన్ని సంగతులు విన్నాను.''

''నేను మీరు వ్రాసిన కథల నన్నింటినీ చదివాను. వాటిలో జీవకళ వుట్టిపడుతూవుంది. క్లాసులో పాఠాలు చెప్తున్నపుడల్లా నామనస్సు మీమీదనే వుంటుంది మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను. చాల కాలంనుండి యీ విషయం మీతో చెప్పాలని అనుకుంటూ వున్నాను. కాని సమయం లభించలేదు.''

ఈ మాట వినగానే తను ఎంతగా ఆశ్చర్య పడాలో అంత ఆశ్చర్యపడ్డాడు.

''సరోజా! ఒక్కొక్కరి హృదయంలో ఒక్క స్త్రీకే స్థానముంటుంది. నేను నిర్మలను ప్రేమించాను. ఆమె నన్ను తృణీకరించింది. కాని ఆమె ఎప్పటికైనా నాదానిగా అవుతుందనే నమ్మకం నాలో గట్టిగావుంది.''

''సత్యం! నిజంగా నీవు అమాయకుడివే! మగవాళ్ళకి తెలియని విషయాలుకూడ కొన్ని ఆడవాళ్ళకు తెలుస్తూవుంటవి. నిర్మల కోదండ రావును ప్రేమిస్తూవుంది.''

తనతలమీద పిడుగు పడిందన్నట్లుగా వ్యధ చెందాడు సత్యం.

''ఇది నిజమా సరోజా? నాకు యిన్ని రోజులనుండి తేలియనే తెలియదు.''

''నిజం, సత్యం! అయినా, నీవెందుకు నిర్మలను ప్రేమిస్తున్నావో నాకు తెలుసు.''

(సశేషం)

---

సరి క్రొత్త కుటీర పరిశ్రమల పుస్తకము

అనేకరకాల కుటీర పరిశ్రమలు, వాటికి వలయు ముడిపదార్థాలు, యంత్రాలు లభించే చోట్ల పూర్తి వివరాలతో సహా, వెల రు. 4-50. పోస్టేజి ఒక రూపాయి.

COTTAGE INDUSTRY (K M 4)
Post Box No. 1262, DELHI.

---

'కథాంజలి'

[చక్కని కథల మాసపత్రిక]

స్థాపితం. 1938.

| | |
|---|---|
| విడి ప్రతి — | 25 న. పై. |
| సంవత్సర చందా | 4-0-0. |

(ప్రత్యేక సంచికలతో సహా.)

అన్ని హిగిన్ బాథమ్స్ బుక్ స్టాలులోనూ దొరకును.